# గుర్వింద

## గుడిసేవ సుందరరామయ్య

"నమస్కార మండీ!"

అపరిచితమైన కంఠం వినిపించగానే తలెత్తి చూశాను.

ఎదురుగా ఓ వ్యక్తి నవ్వుతూ నిల్చొన్నాడు.

వయస్సు దాదాపు ముప్పయి సంవత్సరాలుండవచ్చు. ఎర్రని శరీర ఛాయ, బక్క చిక్కిన దేహం, మాసిన గడ్డం, లోతుకు పోయిన కళ్ళు, చిందర వందరగా నుదిటి మీద పడ్తున్న జుట్టు – అతని రూపాన్ని గతంలో ఎన్నడూ చూసిన గుర్తులేదు నాకు.

"మీరే కదూ, శేఖర్!" నవ్వుతూనే ప్రశ్నించాడు.

"అవును! మీరు..."

"నా పేరు ఆనందరావు సాహిత్యమంటే నా కభిమానం ఎక్కువ. మొన్నీ మధ్య వార పత్రికలో మొదటి బహుమతి పొందిన మీ 'కోకిల' కథ చదివాను. అది చదివి నప్పట్నుంచీ మిమ్మల్ని కల్సుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. కాని నా ప్రయత్నం నేటికిగాని ఫలించలేదు. అంత చక్కని కథను మాలాంటి పాఠకులకు అందించినందుకు ముందుగా మీకు కృతజ్ఞతలు తెల్పుకొంటున్నాను. ఐమస్ట్ కంగ్రాచ్యులేట్ యు!" అంటూ తన చేతినందించాడు.

"థాంక్యు వెరీమచ్!" అంటూ కరచాలనం చేశాను.

ఇంకా అతను నిలబడే ఉన్నాడన్న విషయం స్ఫురించగానే "అయామ్‌సారీ! టేక్ యువర్‌సీట్ ఫస్ట్!" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాను.

అతను కుర్చీలో కూర్చున్నాడు.

"వెరీగ్లాడ్ టు మీట్‌యు మిష్టర్‌రావ్! మీరు కూడా కథలు రాస్తుంటారా?"

"లేదండీ! చదువుతాను! మంచి మంచి కథలు చదవటమంటే నాకు గొప్ప సరదా! మీ కోకిల కథ చదివి బాగా యింప్రెస్ అయ్యాను. అందులో ఉన్న నాల్గు పాత్రలు నాల్గు ఆణి ముత్యాల్లాంటివి! కాలు జారిందని తెల్సికూడా ఒక అమాయకురాలిని భార్యగా స్వీకరించ గల్గిన మధు పాత్ర మరపురానిది! పెళ్ళి కాకముందు ఒకరికి పెళ్ళయ్యాక మరొకరికి హృదయాన్ని అర్పించాల్సిన పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొన్న సుశీల పాత్ర ఉన్నతమైంది! ఇక కన్నతండ్రి ఎవ్వరో తెల్సుకోలేక మధునే తండ్రిగా భావించి ఆత్మీయతను పెంచుకున్న పాప పాత్ర. సుశీలకు అన్యాయంచేసి లోకం దృష్టిలో మోసగానిగా మిగిలిపోయిన వాసు పాత్ర- అన్నీ సజీవ పాత్రలంటే అతిశయోక్తిలేదు! ఆ కథ నిజంగా మన సమకాలీన సంఘానికి గొప్ప కనువిప్పు! మారుతున్న మానవ నైజానికి చక్కని నిదర్శనం! అసంఖ్యాకంగా కథలు వెలువడుతున్న ఈ రోజుల్లో అలాంటి

కథలే పదికాలాలపాటు నిలుస్తాయి!

మానవ హృదయం ఔన్నత్యాన్ని, త్యాగనిరతిని చాటిచెప్పిన గొప్ప రచన. ఇవి ముఖస్తుతి మాటలుకావు! నగ్నసత్యాలు! అసలు అటువంటి ఉత్తమ కళా ఖండాలను రచించటం సంస్కార హృదయుడైన రచయితకే సాధ్యమంటాను. ఈ విషయంలో మీ అభిప్రాయ మేమిటి?"

"ప్రతి రచయిత కూడా తన చుట్టూఉన్న సంఘంలోని సమస్యలను సానుభూతితో పరిశీలిస్తాడు. తన శక్తి వంచన లేకుండా వాటికి పరిష్కార మార్గాలను ఆలోచిస్తాడు. సంఘంలో పాతుకుపోయిన పాత సాంప్రదాయాలను, మూఢాచారాలను తన రచనలలో తీవ్రంగా విమర్శించడానికి ప్రయత్నిస్తాడు. అజ్ఞాన తిమిరంలో కొట్టుకుపోతున్న ఈ సంఘానికి దివ్యజ్యోతియై వెలుగొందుతాడు. అయితే ఆ ప్రయత్నంలో అతను ఎంత వరకు విజయాన్ని సాధిస్తాడనేది వేరే విషయం అనుకోండి!"

"నో....నో....ఆ ప్రయత్నంలో అతడు కృతకృత్యుడు కావాలి! తన మనసులోని ఆశయాలను, ఆదర్శాలను కాగితమ్మీద పెట్టడమే కాకుండా స్వయంగా తన చేతలద్వారా చూపించినపుడే అతడు ప్రజలహృదయాలను చూరగొనగలుగుతాడు. అప్పుడే వ్యాధిగ్రస్తమైన ఈ సంఘాన్ని బాగుచేయడానికి అవకాశం ఉంటుంది. తమస్సులో నడుస్తున్న ఈ లోకానికి వెలుగు కిరణాలను ప్రసాదించాల్సిన బాధ్యత రచయిత మీద ఎంతైనా ఉంది"

ఎల్. డి. సి. సుబ్బారావు ఫైలు పుచ్చుకొని నా ఛాంబర్‌లోకి రావటంతో ఆనందరావు తన సంభాషణను తక్కున ఆపివేశాడు.

"ఇది చాలా అర్జంటు కేసు సార్!" అంటూ సుబ్బారావు కొంచెం భయం భయంగా నాకు ఫైలును అందించాడు.

ఫైలు తీసుకొని రెండు క్షణాల పాటు పరిశీలించి "ఈ డ్రాఫ్టింగ్ బాగాలేదని మార్నింగ్ చెప్పాను గదయ్యా!" అన్నాను.

"మీరు చెప్పాక కొన్ని మార్పులు చేశాను సార్!" అన్నాడు సుబ్బారావు ఫైల్లోని లెటర్‌ని చూపిస్తూ.

"ఆఁ....అయినా ఇంకా మిస్టేక్స్ వున్నాయోయ్! రేపు చూద్దాంలే! నౌ ఐయామ్ బిజీ!" అంటూ ఆ ఫైలును అతని కిచ్చేసి ఆనందరావు వేపు తిరిగాను.

సుబ్బారావు బయటికెళ్ళి పోయాడు.

"ఇప్పుడు వచ్చిన వ్యక్తిని చూశారుకదా! అతనొక గ్రాడ్యుయేట్ కాని ఏం లాభం! సింపుల్ లెటర్ డ్రాఫ్ట్ చేయటం కూడా సరిగ్గారాదు. ఇక ఈ డిగ్రీలకు విలువేమిటి చెప్పండి.? విద్యస్థాయి నానాటికీ దిగజారిపోతున్నదండీ. అసలు విజ్ఞానానికీ, డిగ్రీలకు సంబంధమేమీ ఉండటంలేదు. అన్నట్లు మాటల్లోపడి అడగడమే మర్చిపోయాను. ఏం తీసుకొంటారు? బోర్న్ వీటా....ఓవల్టీన్...."

"నో.... థాంక్స్!" అన్నాడు ఆనందరావు కొంచెం ఇబ్బందిగా చూస్తూ.

"డోంట్ బి షై!" అంటూ కాలింగ్ బెల్ కొట్టాను.

ప్యూన్ కోటయ్య లోపలి కొచ్చాడు.

"ఓరేయ్ కోటయ్యా! హోటల్‌కుపోయి రెండు బోర్న్‌వీటా పట్రా." అని వాడికి పురమాయించి ఆనందరావు వేపు చూశాను.

"మీ పాత రచనలుకూడా చదివానండీ! మీరు రాసే ప్రతి కథా నన్ను ఆకర్షిస్తూనే ఉంది. ముఖ్యంగా 'అసమర్థుని జీవితం'లో మీరు సృష్టించిన పేద గుమస్తా పాత్ర మరువరానిది. ఆ కథ చదివిన ప్రతి వ్యక్తికీ పేద గుమస్తాల పట్ల ఎనలేని సానుభూతి ఏర్పడి తీరుతుంది. ఒక ప్రక్క సంసార మంత్రా అప్పుల్లోపడి చితికి పోతున్నప్పటికీ, లంచాలను నిరాకరించి నీతిగా జీవించడానికి సిద్ధ

పడిన గుమాస్తా పరాంకుశం పాత్ర అపూర్వమైంది...."

అప్పుడే శేషాద్రి లోపలికి వచ్చాడు.

శేషాద్రి అంటే మా ఆఫీసులో పని చేస్తున్న యు. డి. సి. ఎవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు ఛాంబర్లోకి రావద్దని స్టాఫ్‌కు ముఖ్యంగా ఈ శేషాద్రికి ఎన్నో సార్లు చెప్పాను. అయినా నా మాటను ఇలా అప్పుడప్పుడూ అలక్ష్యపరుస్తూనే ఉన్నాడు. అతని రాక నాకు చిరాకు కల్గించింది.

"ఎమోయ్! ఏం కావాలి?" అని అడిగాను విసుగ్గా.

"మరేం లేదుసార్! మా బావమర్ది దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. మా ఆవిణ్ణి పురుటి నొప్పులొస్తే హాస్పిటల్లో జాయిన్ చేశారట. అందుకని నాకు రెండ్రోజులు సెలవు కావాలి!" అంటూ వినయంగా చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

"అయితే నీకెంతమంది పిల్లలేమిటి?" తక్కున ప్రశ్నించాను.

"నల్గురండీ! పుట్టబోయే పాపతో ఐదు."

"వ్వాట్?" అంటూనే గట్టిగా నవ్వేశాను. నా నవ్వుతోపాటు వాళ్ళిద్దరూ శృతి కలుపుతారేమోనని ఆశించిన నాకు వాళ్ళిద్దరూ మౌనంగా ఉండటం, కనీసం చిరునవ్వు కూడా వాళ్ళ పెదాలమీద కదలక పోవటం నాకొక్కించెం ఆశ్చర్యాన్ని కల్గించింది. ఒక వేళ నా నవ్వులోని పరమార్థం అర్థం కాక పోవటంచేత అలా అచేతనులయ్యారేమో నన్న అనుమానం కల్గింది.

"మిస్టర్ శేషాద్రి! నీవు చదువుకొన్న వాడివి! మన జనాభా పెరుగుదల మనదేశం ఎదుర్కొంటున్న సమస్యలు. ఆర్థిక పరిస్థితి నీక్కూడా తెల్సు! పోనీ అదలా ఉంచు! 'ఇద్దరు లేక ముగ్గురు చాలు' అని మన ప్రభుత్వం ఓ ప్రక్కన హెచ్చరిస్తుంటే నీవింకా ఫామిలీ ప్లానింగ్ ఎందుకు అమలు జరుపలేదు?'

"ఈసారి తప్పకుండా పాటించాలనుకొంటున్నానుసార్!" అన్నాడు శేషాద్రి సిగ్గుపడ్తూ.

"దట్స్‌గుడ్! కాని చూడు శేషాద్రి! మన సెక్షన్లో ఇద్దరేమో సిక్‌లీవ్‌లో ఉన్నారు. మరొకడేమో మూడ్రోజులు సెలవు పెట్టి కూతుర్ని అత్తారింటికి పంపటానికి వెళ్ళాడు. ఇదేమో అకౌంట్స్ క్లోజింగ్ టైమ్! ఈ సమయంలో లీవ్ గ్రాంట్ చేయాలంటే కష్టమైన పనయ్యా!" అన్నాను.

"ప్లీజ్! రెండ్రోజులు గ్రాంట్ చేస్తే చాలుసార్!" అంటూ ప్రాధేయపడ్డాడు శేషాద్రి.

"రెండురోజులు నువ్వులేకపోతే ఎంత వర్క్ పెండింగ్‌లో పడిపోతుందో ఆలోచించావా?"

"అవుటాఫ్ అవర్స్‌లో కూర్చునైనా సరే నేను వచ్చాక పెండింగ్ లేకుండా చేస్తానండీ!" హామీ ఇచ్చాడు శేషాద్రి.

"ఎనీహౌ? రేపు ఆలోచిద్దాంలే. రేపు మార్నింగ్ కన్పించు."

"థాంక్యూ సర్!" అనేసి వెళ్ళిపోయాడు శేషాద్రి.

వెళ్ళిపోతున్న శేషాద్రి వైపు నా వేపు మార్చి మార్చి చూశాడు ఆనందరావు.

[సశేషం]

# గుర్వింద

## గుడిసేవ సుందరరామయ్య

(గతసంచిక తరువాయి)

"ఏమిటోనండీ. ఈ లీవ్ విషయంలో నే నెవ్వరికీ హెల్ప్ చేయలేక పోతున్నాను. మా కిచ్చిన స్టాఫ్ తక్కువ. వర్క్ ఎక్కువ. ఎడిషనల్ స్టాఫ్ కావాలో మొర్రో అంటుంటే మా సుపీరియర్స్ విన్పించుకోవటంలేదు. వీళ్ళేమో నెలకు నాలుసార్లు లీవ్ అడుగుతుంటారు. పోనీ అవసరమనేది ఎవ్వరికైనా ఉంటుందికదా, అని గ్రాంట్ చేస్తే మరొక ఊరినుంచి ఎక్స్‌టెన్షన్ కోసం టెలిగ్రామ్స్ ఇస్తారు. ఇలాంటి చిక్కులను దృష్టిలో పెట్టుకొని లీవ్ గ్రాంట్ చేయటమే మానుకొందామంటే నన్నొక కర్కోటకుని క్రింద జమకడ్తారనే భయం ఒకటి. మిసరబుల్ సార్, ఈ ఆఫీసరు పోస్టంటే నా కసలు [illegible]"

నేను చెప్తున్న సంజాయిషీని [illegible] వింటూ ఉండిపోయాడు ఆనందరావు.

అంతలోనే కోటయ్య [illegible] కప్పులను టేబుల్ మీద పెట్టాడు.

"టేకిట్! మిస్టర్ ఆనందరావ్" అంటూ ఓ కప్పును అతనికి అందించి మరో కప్పు నేను అందుకొన్నాను.

[illegible] త్రాగుతూనే టేబుల్‌మీద ఉన్న ఓ ఫైలును తీసి కోటయ్య చేతికిచ్చి "చూడు కోటయ్యా! ఈ ఫైలును తీసికెళ్ళి సుందరానికివ్వు! వెంటనే చెక్కు కూడా తయారు చేయమని చెప్పు! పరంధామయ్య గారి కేసని కూడా చెప్పు! వెరీ అర్జంట్!" అన్నాను.

ఆనందరావు త్రాగటం పూర్తిచేసి కప్పును టేబుల్ మీద పెట్టాడు.

"బొత్తిగా నస్సు లేదుకదూ! మరీ పానకంలా చేసాడు వెధవ!" అన్నాను [illegible] చిట్లిస్తూ.

"ఫర్వాలేదు! బాగానే ఉంది సార్!" అన్నాడు ఆనందరావు.

"మీరేదో మొహమాటానికి అలా అంటున్నారు" అంటూ నేనుకూడా ఖాళీకప్పును టేబుల్‌మీద పెట్టాను.

"సుందరంగారు సీట్లో లేరండయ్యగారూ!" అంటూ వచ్చాడు కోటయ్య.

"ఎక్కడికి పోయాడు?"

"ఎవరో స్నేహితుడొస్తే వెళ్ళాడండి."

"రోజు కెంతమంది వస్తారయ్యా స్నేహితులు? ఈ ఉద్యోగం వదిలేసి [illegible] స్నేహితులతోపాటు బజార్లలో షికార్లు కొట్టవచ్చుగా! సర్లే వెళ్ళు. అతను రాగానే నా దగ్గరకు పంపించు!" అన్నాను చిరాకుగా.

"అలాగేనయ్యా!" అంటూ టేబుల్ పైనున్న ఖాళీ కప్పులు తీసుకొని బయటకు వెళ్ళాడు కోటయ్య.

ఆనందరావు నావైపు విచిత్రంగా చూస్తున్నాడన్న సంగతిని గమనించి, "[illegible]

ఆనందరావ్! మీరే డిపార్ట్‌మెంట్లో పని చేస్తున్నారు?" అని ప్రశ్నించాను.

"ఏదో ఓ చిన్న ప్రయివేటు కంపెనీలో చేస్తున్నానులెండి." అంటూ తలదించుకొన్నాడు ఆనందరావు.

"దెన్ యు ఆర్ లకీ! ఈ గవర్నమెంటు ఆఫీసులో ఆఫీసర్ పోస్టుకంటే ప్రయివేట్ కంపెనీలో క్లర్క్ ఉద్యోగం నయం! వచ్చినప్పట్నుంచీ నా బాధలు చూస్తూనే వున్నారు కదా!" అంటూ కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొన్నాను.

నా మాటలకు ఓ చిరునవ్వు నవ్వి, "మీ కాలేజీ ఎడ్యుకేషన్ కూడా ఇక్కడే జరిగిందా?" అంటూ హఠాత్తుగా అడిగాడు ఆనందరావు.

"లేదండీ! గుంటూర్లో బి. ఎ. వరకు చదివి ఆ తర్వాత హైదరాబాద్‌లో ఎమ్. ఏ., ఎల్. ఎల్. బి. పూర్తిచేశాను." అని సమాధానం చెప్పాను.

"అలాగా! నేనుకూడా గుంటూర్లోనే చదువుకొన్నాను. మీ ఫాదర్ అక్కడ ఏమి చేసేవారు?"

ఆనందరావు అంత వివరంగా నా స్వ విషయాలు ఎందుకు అడుగుతున్నాడో నాకు అంతు పట్టటంలేదు. అయినా అతను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పటం వలన కలిగే నష్టమేమీ లేదని మనస్సులోనే సరిపెట్టుకొన్నాను.

"మా ఫాదర్ నా చిన్నతనంలోనే పోయారు. మా మేనమామగారే నన్ను చదివించి నన్నొక ఆఫీసరును చేశారు. ఆయన పేరు శివరామయ్యగారు. ఆ ఊళ్ళోనే పేరుపొందిన వ్యాపారవేత్త!"

"ఆ.... మీరు శివరామయ్యగారి మేనల్లుడా?" ఆశ్చర్యానందాలు అతని ముఖంలో తొంగి చూశాయి.

"మీకాయన తెలుసా?" అంతకంటే ఆశ్చర్యంగా అడిగాను.

"నాకు ఆయన చాలాబాగా తెల్సండి! ఉదారస్వభావులు! నేను కాలేజీలో చదువుకొనేటప్పుడు వాళ్ళవీధిలోనే ఉండేవాణ్ణి. ఆయన మంచితనాన్ని గురించి ఆ వీధిలో వాళ్ళంతా ఎంతో గొప్పగా చెప్పుకొనేవారు."

"మీ స్వస్థలం కూడా గుంటూరేనా?" అనుమానంగా అడిగాను.

"కాదండీ! మంగళగిరి ప్రక్కనున్న ఓ పల్లెటూరు! ప్రస్తుతం హైద్రాబాద్‌లో సెటిలయ్యాను..."

సుందరం లోపలికి రావటాన్ని గమనించి ఆనందరావు తన వివరాలను చెప్పటం మానేశాడు.

"వాట్ మిస్టర్ సుందరం! కోటయ్యతో ఫైలు పంపించాను. ఆ చెక్కు కాస్త త్వరగా తయారు చేస్తే పరంధామయ్య ముఖానికొడదాం! సాయంత్రానికల్లా తయారయేట్లు చూడు!"

"అలాగే సార్!" అనేసి సుందరం వెళ్ళిపోయాడు.

"శివరామయ్యగారి మేనల్లుడన్న విషయం చెప్పాక నా మనసుకెంతో ఆనందంగా ఉందండీ. ఎవరో ఆత్మీయులను చూసినట్లు ఫీలవుతున్నాను." అన్నాడు ఆనందరావు సంతోషంతో కరచాలనం చేస్తూ.

"ఐ యామ్ ఆల్సో వెరీ గ్లాడ్ టు మీట్ యు. బై దిబై టైమ్ ఐదు కావస్తోంది. మా ఇంటికి వెళ్దాం పదండి." అంటూ కుర్చీలోంచి లేచాను.

"మరోసారెప్పుడైనా వస్తానులెండి." అన్నాడు ఆనందరావు కొంచెం మొహమాటంగా లేచి నిల్చొంటూ.

"బలేవారే ఎంతో దూరంనుంచి నా మీద అభిమానం కొద్దీ మీరు వచ్చారు కేవలం ఒక్క థాంక్సుతోనే మిమ్మల్ని సాగనంపటం మర్యాద లక్షణం కాదు. ఎట్లీస్టు ఒక్కపూటైనా మా గృహానికేతెంచి మా ఆతిథ్యాన్ని స్వీకరించాలి, కనుక...." అంటూ

నవ్వుతూ అతని భుజమ్మీద చేయివేసి నా ఛాంబర్‌లోంచి బయటకు తీసికెళ్ళాను.

అతన్ని వెనుక కూర్చోమని చెప్పి స్కూటర్ స్టార్ట్ చేసాను.

"హోటల్ "మమత" ముందు స్కూటర్ ఆపి ఆనందరావును లోపలికి నడిపించుకు వెళ్ళాను. మేమిద్దరం మాట్లాడుకొంటూ కూల్ డ్రింక్స్ త్రాగుతూండగా పరంధామయ్య లోపలికి వచ్చాడు.

"నమస్కారం శేఖర్ బాబుగారూ!" అంటూ వచ్చి మా ప్రక్కనే ఖాళీగా వున్న వేరే కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా ఉన్న సర్వర్‌ను ఓ కూల్‌డ్రింక్ తీసుకు రమ్మని ఆర్డరిచ్చి నాతో సంభాషణ ప్రారంభించాడు.

"అయ్యా! శేఖర్‌గారూ! తమరికింకా మామీద దయ కలిగినట్లు లేదు! ఇప్పటికీ మీ ఆఫీసు చుట్టూ, ఇంటి చుట్టూ ఎన్నోసార్లు తిరిగాను. అయినా మామీద కరుణ చూపటం లేదు.

"ఇవ్వాళంతా మీ పనితోనే సరిపోయింది పరంధామయ్యగారూ! రేప్రొద్దున్నే వచ్చి మీరు చెక్కు తీసికెళ్ళవచ్చు!"

"నిజంగానా! థ్యాంక్స్ బాబూ! ఎప్పట్నించో అడుదామనుకొంటున్నాను శేఖర్ గారూ! వెధవ మతిమరుపు ఎక్కువై పోయింది నాకు. మీ బర్త్‌డే కిచ్చిన ఫాన్ బాగా పనిచేస్తూందా? ఆ మధ్య కొంచెం ట్రబుల్ ఇస్తుందని చెప్పారు కదూ! దాన్ని మా షాప్‌కు పంపించి వేయండి. ఈ మధ్యనే ఆ కంపెనీ వారిది మరొకటి కొత్త మోడల్ వచ్చింది. దాన్ని పంపిస్తాను!"

ఆనందరావు నా వైపు అనుమానంగా చూడటం నేను గమనించాను. పరంధామయ్య తన ప్రసంగాన్ని ఇంకా పొడిగిస్తే ప్రమాద స్థితి ఏర్పడుతుందన్న విషయాన్ని గుర్తించి వెంటనే టాపిక్ మార్చటానికి ప్రయత్నించాను.

"నా యిటీజ్ ఆల్‌రైట్! అన్నట్లు మీ బిజినెస్ బాగా నడుస్తూందా?"

"ప్రస్తుతానికి ఫర్వాలేదండి! మీలాంటి పెద్దల సహకారముంటే త్వరలోనే గాంధీనగర్‌లో కూడా మరోషాపును ఓపెన్ చేయాలనుంది" అన్నాడు పరంధామయ్య తన మీసాలను సవరించుకొంటూ.

అంతలోనే సర్వర్ వచ్చి బిల్లును టేబుల్ మీద పెట్టాడు. పరంధామయ్య తన బరువైన జేబులోంచి ఓ నోటు తీసి బిల్లున్న ప్లేటులో వదిలాడు. నేను మౌనంగా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగించిందో ఏమో ఆనందరావు నావైపు వింతగా చూశాడు. 'ఇది మామూలే' అనే అర్థం స్ఫురించేటట్లు నేనో చిరునవ్వు నవ్వి "వస్తానండి! పరంధామయ్యగారూ!" అంటూ ఆనందరావు భుజమ్మీద చేయివేసి బయటకు వచ్చాను.

స్కూటర్‌ను స్టార్ట్ చేస్తుండగా ఓ బిచ్చగాడు వచ్చి "బాబూ! ధర్మం చేయండి!" అంటూ గిన్నెను చూపించాడు.

"పోరా! వెధవా! చిల్లరలేదు!" అంటూ వాడిని కసురుకొని స్కూటర్‌ను స్టార్ట్ చేశాను.

"ఈ బిచ్చగాళ్ళ న్యూసెన్స్ రోజు రోజుకూ పెరిగిపోతుందండీ! అలాంటి వాళ్ళను మనం ఎంకరేజ్ చేయకూడదు! ఏమంటారు?" అన్నాను.

"నిజమే!" అని మాత్రమే సమాధానం చెప్పాడు ఆనందరావు.

అతనంత క్లుప్తంగా సమాధానమివ్వటం నాకు నచ్చలేదు. వెంటనే నాకో విషయం స్ఫురణ కొచ్చింది. ఓసారి బిచ్చగాని ట్రాజిక్ స్టోరీనిరాసి కన్సొలేషన్ ప్రయిజ్‌ను సంపాదించుకొన్నాను. కొంపదీసి ఆనందరావు ఆ స్టోరీని చదవలేదు కదా!

పది నిముషాల్లో స్కూటర్ మా ఇంటి ముందాగింది.

ఆనందరావును లోపలికి ఆహ్వానించి సోఫాలో కూర్చోమని చెప్పి, ఇంగ్లీషు

మాగజైన్స్ రెండు అతని ముందు పడేసి లోపలికెళ్ళాను.

"రేణూ! ఏం చేస్తున్నావ్! పాప ఇంకా కాన్వెంట్ నుంచి రాలేదా?" అంటూ వంటింట్లోకి వెళ్ళాను.

"లేదండి! ఏమిటి? ఇవాళ ఇంత పెందలాడే వచ్చేశారే?" తన గుండ్రటి కళ్ళను అందంగా త్రిప్పుతూ అడిగింది.

"అవును రేణూ. ఇవాళ మా ఫ్రెండ్ ఒకతను వచ్చాడు!" అన్నాను. అతనెటువంటి స్నేహితుడో వివరంగా చెప్పకుండానే కేవలం ఒక అభిమానిని ఇంటికి తీసుకు వచ్చానని చెబితే రేణుక పరిహాసం చేస్తుందనే విషయం నాకు తెలుసు.

అందుకనే అబద్ధం చెప్పేశాను.

"అయితే కాఫీ, గట్రా తయారు చేయమంటారా?" చిరాకుగా అడిగింది.

"నీకా శ్రమ అక్కర్లేదు. అవన్నీ హోటల్లో ముగించుకు వచ్చాము. అన్నట్లు అతను చాలా దూరం నుంచి వచ్చాడు. ఈ రాత్రికి మనింట్లోనే భోజనం ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది."

"ఏమిటోనండీ! మీ తరహా నాకేమీ నచ్చటంలేదు. రోజు కొందర్ని స్నేహితులంటూ తీసుకొచ్చి నా ప్రాణం తీస్తున్నారు. రెండురోజుల నుంచీ వంట మనిషికూడా రావటంలేదు. వాళ్ళ అభిమానానికి హద్దు లేకపోయినప్పటికీ, మీరిచ్చే ఆతిథ్యాలకు హద్దంటూ ఉండకపోతే ఎలా?"

"హుష్ అతను చాలాయేళ్ళనుంచి నన్ను చూడాలనే కుతూహలంతో వచ్చాడు. డోంట్ బి సిల్లీ! అతను మన మాటలు వింటే నొచ్చుకొంటాడు. నీ సంగతి తెల్సే అతన్ని హోటల్లోకి తీసుకు పోయి కాఫీ, టిఫిన్లు ఇప్పించాను."

"ఆ స్కూటర్ మీదే తీసుకెళ్ళి ఆ హోటల్లోనే భోజనం కూడా పెట్టిస్తే నాకు శ్రమ తగ్గేదిగా!" మూతిని తిప్పుకొంటూ ప్రక్క

# వింత లోకం

—ప్రమద్వర

ఈ విశాల విశ్వంలో
వింత వింత అందాలు

నీలపు కొండలు - తెల్లని మబ్బులు
పచ్చటి చేనులు - పరిగెత్తే సెలయేర్లు
మెరిసే నక్షత్రాలు - కురిసే
పన్నీటి ధారలు
కిలకిలనవ్వే పక్షులు - మిల మిలలాడే
మరెన్నో అందాలు

ఇన్ని అందాలున్న ప్రకృతిలో
అందంలేని వికృతిరూపాలు
మనుష్యులు

గదిలోకి వెళ్ళింది రేణుక.

"నీవెప్పుడూ యింతే!" అని గొణుక్కుంటూ హాల్లోకి వచ్చాను. నేను వెళ్ళేసరికి గోడకు తగిలించి ఉన్న పాప ఫోటో వంక తదేకంగా చూస్తూ నిలబడ్డాడు ఆనందరావు. నన్ను చూడగానే కొంచెం తత్తరపడి "ఆ ఫోటోలో ఉన్నది...."

"మా పాప...." అన్నాను.

"పాప చాలా అందంగా ఉంది. పోలికలు వాళ్ళమ్మవే కాబోలు!"

క్షణంపాటు నా ముఖంలో వెలిసిన ఆశ్చర్యరేఖను గమనించినట్లున్నాడు. వెంటనే "మరేంలేదు మీ పోలికలు ఏమీ కనపడలేదు. అందుకని అలా భావించాల్సి వచ్చింది.

యామ్ ఐ కరెక్ట్ ?" అన్నాడు.

"సెంట్ పర్సెంట్ !" అంటూ నవ్వేశాను.

"పాప ఫోటోలో కన్పించినంత అందగత్తె కావచ్చు ! కాని ఆ ఫోటోలోని అమాయకత్వం ఫోజ్ కోసమే సందోయ్ ! వర్త్ పెంకి ఘటం ! కాన్వెంటుకు వెళ్ళింది. వచ్చే టైమ్‌కూడా అయింది. ఇలా వచ్చి కూర్చోండి !" అంటూ సోఫాలో కూర్చోమన్నాను.

ఆనందరావు సోఫాలో కూర్చున్నాక నేను అతని కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చొని సిగరెట్ వెలిగించాను.

"శేఖర్‌గారూ ! నాకో చిన్న అనుమానం వచ్చింది...." అంటూ రెండు క్షణాలు ఆగాడు ఆనందరావు.

"అడగండి !" అన్నాను నవ్వుతూ.

"ఆఁ....మరేంలేదు ! మీ 'కోకిల' కథలో వాసు పాత్ర పట్ల పాఠకుల కెవరికైనా సానుభూతి కలుగుతుం దంటారా ?"

"వై నాట్ ? సర్టన్లీ ! నా దృష్టిలో వాసు పాత్రే ఎంతో ఉన్నతమైంది ! పాఠకు లంతా ఆ పాత్రనే మెచ్చుకొంటూ నాకు ఉత్తరాలు రాశారు !"

"విచిత్రంగా ఉందే ! కాలేజీలో ఏర్పడిన పరిచయాన్ని పెంచుకొని చివరకు సుశీల శీలాన్నే బలిగొన్న వాసు పాత్ర అందరికీ నచ్చినదంటారా ? సుశీల గర్భవతి అన్న విషయం తెల్సుకొని ఆ ఊరినుంచే పరారీ అయిపోయిన వాసుపాత్రను ఎలా క్షమించారు పాఠకులు ? వాసు పట్టి మోసగాడు ! సుశీల పరిస్థితి అంతా తెల్సికూడా వివాహం చేసుకొన్న మధుబాబు లాంటి సంస్కార హృదయునితో పోల్చటానికూడా తగడు."

"బహుశా మీరు కథను మర్చిపోయి వున్నారు. తను ఏ పరిస్థితుల్లో సుశీలకు అన్యాయం చేయాల్సి వచ్చిందో వివరంగా లెటర్ రాస్తాడు వాసు. ఆ ఉత్తరమే అతని ముందు చూపుకు, నిస్వార్థ బుద్ధికి నిదర్శనం ! పరిస్థితులు చేతులు దాటాక అతనికి తన 'కాన్సర్' వ్యాధి సంగతి తెల్సింది ! తను ఎక్కువకాలం జీవించడన్న విషయం డాక్టర్ తన తండ్రికి చెప్తుంటే విన్న వాసు ఎంతో తల్లడిల్లిపోయాడు. ఎందుకు ? తన ప్రాణం కోసం కాదు ! సుశీలకు అన్యాయం జరిగిపోయిందనే బాధ చేత. తనను చేసుకొని సుశీల కొద్ది కాలంలోనే వైధవ్యం పాలు కావటానికి అతని మనస్సు అంగీకరించ లేదు. సుశీలను కల్సుకొని స్వయంగా అసలు విషయాన్ని చెప్పాలనుకొన్నాడు. కాని అలా చేయటం వలన మరికొన్ని నూతనసమస్యలు తలెత్తుతాయని భావించి తన ఆచూకీ కూడా వాళ్ళకు తెలియకుండా జాగ్రత్త పడ్డాడు. వాసు నిజంగా మోసగాడయినట్లయితే తన స్వార్థం కోసమైనా సుశీలను వివాహం చేసుకొని ఉండేవాడే ! ఇక మధుబాబు పాత్ర గురించి మీకు సదభిప్రాయమే ఉన్నట్లు కన్పిస్తూంది ! కాని ఇక్కడ ఒక్క విషయాన్ని మనం మర్చిపోగూడదు. సుశీలను వివాహం చేసుకోటానికి తన మేనమామ మీదున్న కృతజ్ఞత కూడా కొంత కారణమే ! అయితే పాపకు జన్మనిచ్చిన తండ్రి వాసు అయినప్పటికి తన స్వంత బిడ్డలా పెంచ కల్గాడంటే మధుబాబు యొక్క విశాల హృదయమే కారణం ! ఏమైనప్పటికీ నాకు మాత్రం వాసు పాత్రంటేనే సానుభూతి ఎక్కువ !"

"ఇది మీరు మనస్ఫూర్తిగా అనే మాటేనా ?"

"వై నాట్ ?"

"చాలు ! ఆ పాత్రమీద మీ కామాత్రం సానుభూతి ఉంటే చాలు ! కాని మీరు సుశీల పాత్రకే బాగా అన్యాయం చేశారన్పిస్తూంది !"

ఆ మాటలు వినగానే నేను గతుక్కుమన్నాను. ఆనందరావు ఏ ఉద్దేశ్యంతో అలా

అంటున్నాడో గ్రహించ లేకపోయాను.

"సుశీల పాత్రకా? ఏ విధంగా?" అని అడిగాను అనుమానంగా.

"స్త్రీ తన హృదయాన్ని జీవితంలో ఎవరో ఒకరికే అర్పించుకోవటం సహజం! కాని ఇద్దరు వ్యక్తుల ప్రేమను పంచుకోవాల్సిన దుస్థితిని, సుశీల హృదయానికి కల్పించారు!"

నేను తేలికగా ఊపిరి పీల్చుకొన్నాను.

"మిస్టర్ రావ్! పెళ్ళి కాక ముందు మనస్సులో ఎలాంటి ఆలోచనలున్నా, ఎలా ప్రవర్తించినా పెళ్ళయ్యాక భర్తను ఆరాధించటం ప్రతి భారత స్త్రీ పవిత్ర ధర్మం! నా సుశీల పాత్ర ఆ ధర్మాన్ని కాపాడగల్గింది!."

"థ్యాంక్యూ శేఖర్! నాక్కూడా అదే కావాలి. సుశీల తన పాత జీవితాన్నంతా పీడకలగా మర్చిపోయి నిర్మలహృదయుడైన మధుతో పచ్చగా పది కాలాలపాటు సుఖంగా కాపురం చేయాలి. అదే నా కోరిక కూడా! ఆ వాసుగాడు ఆమెకు కలలోకూడా గుర్తు రాకూడదు! వాడి జీవితం ఆనాటితోనే నశించింది ...." అన్నాడు ఆనందరావు ఆవేశంగా.

ఆనందరావు అంతగా ఎందుకు ఆవేశపడ్తున్నాడో ఎంత ఆలోచించినప్పటికీ నాకు అర్థంకాలేదు. కాని అతని మాటల్నిబట్టి వాసు పాత్రను అసహ్యించుకొంటున్నాడని మాత్రం గ్రహించగల్గాను.

"మిష్టర్ రావ్ ఆవేశపడకండి! కేవలం ఒక కథలోని పాత్రను నిందించటానికే అంత ఉద్రేకాన్ని వ్యక్తం చేసుకోవటం మంచిదికాదు." అన్నాను.

"లేదు శేఖర్ ఇది కథకాదు. వాస్తవం! నన్ను నమ్మండి! ఒక్కసారి సుశీలను పిలవండి!"

నేను ఆశ్చర్యపోయాను!

ఏదైనా మెంటల్ షాక్ తిన్నాడేమో నన్ను అనుమానం వచ్చింది. అయినా నా అనుమానాన్ని బయట పెట్టకుండా "మిస్టర్ రావ్! కథలోని పాత్రలు సజీవాలై మనస్సులో మిగిలిపోవచ్చు. కాని కళ్ళెదుటకు రమ్మంటే ఎలా వస్తాయి? మొత్తానికి బలే జోక్ వేశారే!" అంటూ నవ్వటానికి ప్రయత్నించాను.

"లేదు! శేఖర్! నేను జోక్ చేయటం లేదు! ప్లీజ్! సుశీలను పిలవండి!"

"మిష్టర్ రావ్! మీకేమైనా పిచ్చెక్కిందా? సుశీల ఎవరు?"

"మిథ్యా!"

"మిష్టర్! వ్హాట్ ఆర్ యు టాకింగ్?" కొంచెం కోపంగా అడిగాను.

"మీది 'మధు' పాత్ర అన్న విషయం నాకెప్పుడో తెల్సు! మీరు సుశీలను పెళ్ళి చేసుకొని గొప్ప త్యాగమూర్తి అయ్యారని నాకు తెల్సు!"

ఆనందరావు మాటలువిని తెల్లబోయాను కొన్ని నిమిషాలపాటు అతని వైపు ఆశ్చర్యంగా చూస్తూండిపోయాను.

"శేఖర్‌గారూ! ఆశ్చర్యపోతున్నారా నేను వాసు ప్రాణస్నేహితుణ్ణి. వాడు సుశీలను అంటే మీ మామయ్యగారి పెద్దమ్మాయిని ప్రేమించిన విషయం ఆమెను మోసం చేసిన విషయం నాకు బాగా తెల్సు! 'కోకిల' కథ చదువు తున్నప్పుడు అది వాసుగాడి జీవితగాథన్న అనుమానం నాకు కల్గింది. ఆ అనుమానాన్ని రూఢి చేసుకోవటం కోసమే అంతదూరం నుంచి మీ దగ్గరకు వచ్చాను. 'కాన్సర్' వ్యాధితో బాధ పడుతున్న వాసు ఇంకా జీవించే ఉన్నాడు. ఇప్పుడు చెప్పండి. ప్లీజ్ టెల్ మి ది ట్రూత్. సుశీలను మీరు పెళ్ళి చేసుకొన్నారు కదూ. సుశీల క్షేమంగానే ఉంది కదూ?"

ఆనందరావు కళ్ళల్లోని ఆర్ద్రతను గమనించాను. కాని ఆ సమయంలో ఏం చేయాలో నాకు తోచలేదు. ఆనందరావు చెప్పినట్లు నేను

వ్రాసింది కథ కాదు. అది వాస్తవిక గాథ. యథార్థ గాథను తీసుకొని కథ వ్రాయటం వలన చిక్కులు వస్తాయని ఊహించ లేదు. ఇది కల్పనా గాథ అని అబద్ధం చెప్పినా అతను విన్పించుకొనేటట్లు లేడు. అయినా అతనికి నచ్చచెప్పటానికి ప్రయత్నించాలను కొన్నాను.

"ఎక్స్క్యూజ్ మి! రావ్! 'కోకిల' కథ నిజమైంది కాదు! నా ఊహ మాత్రమే!"

"నో! అలా జరగటానికి వీల్లేదు. ఇటీజ్ ట్రూ!"

"ప్లీజ్ నా మాట నమ్మండి!"

"అయితే మీ మామయ్యగారి పెద్దమ్మాయిని మీరు వివాహం చేసుకోలేదా?" అని అడిగాడు వణుకుతున్న కంఠంతో.

సూటిగా నా కళ్ళల్లోకి చూస్తున్న అతని చూపుల్ని ఆ క్షణంలో భరించ లేకపోయాను. చూపు ప్రక్కకు మరల్చు కొని రెండు క్షణాలపాటు ఆలోచించాను. వెంటనే ఓ ఆలోచన తట్టింది. గబగబ అడుగులు వేసుకొంటూ గుమ్మం వరకు వెళ్ళి–

"రేణూ! ఒకసారి ఇలా రా!" అంటూ పిల్చాను. లోపల్నుంచి రేణుక వచ్చింది.

"మిస్టర్ రావ్! ఈవిడే నా భార్య!" గంభీరంగా అంటూ రేణుకను చూపించాను. నా మాటలు వినగానే ఆనందరావు సోఫాలో సప్పలా కూలిపోయాడు. తన ముఖాన్ని రెండు చేతుల మధ్య దాచుకొని కొన్ని క్షణాలపాటు మౌనంగా ఉండిపోయాడు.

"మిస్టర్ రావ్! ఏమైంది?" అంటూ కంగారుగా అతని దగ్గరకు వెళ్ళాను. నా మాట లను విన్పించుకోకుండా మెల్లగా లేచి నిల బడి రేణుక దగ్గరకు వెళ్ళి "నువ్వు శివ రామయ్యగారి రెండో అమ్మాయివి కదూ! అమ్మా, రేణుకా! నువ్వైనా చెప్పు. మీ అక్కయ్య ఎక్కడుంది?" అని అడిగాడు.

అక్క విషయం గుర్తు చేయగానే ముఖం వివర్ణమైంది! ఆనందరావుకు సమాధానం చెప్పాలో, అక్కర్లేదో తెలియక దుఃఖిస్తూ లోనికి వెళ్ళిపోయింది.

"రావ్! మీకు రేణుక తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాను.

"తెలుసు, శేఖర్! ఆమెకాదు వాళ్ళక్క కూడా తెలుసు! ప్లీజ్ చెప్పండి. ఆమె ఎక్కడుంది?" అంటూ నా భుజాలను కుదిపాడు.

ఇక నిజాన్ని దాయటం వలన ప్రయోజనం లేదనిపించింది.

"క్షమించండి! ఆమె చనిపోయింది" అన్నాను మెల్లగా.

"శేఖర్!" అంటూ పిచ్చివానిలా పొలికేక పెట్టాడు.

"మీరు చెప్పేదంతా నిజమేనా? ఆవిడ చనిపోయిందా? మీరు రాసిన కథ నిజం కాదా?" అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు.

"అవును! మిస్టర్ రావ్! ఆ కథలో మధు పాత్రను ఎంతో ఉన్నతంగా సృష్టించ గలిగాను. కాని నిజ జీవితంలో మాత్రం ఆ పాత్ర మరో విధంగా ప్రవర్తించాల్సి వచ్చింది. నేనూ మానవుణ్ణే. నాకూ ఆశ లుంటాయి. నాకూ స్వార్థం ఉంటుంది! మామయ్య కూతురు కాలు జారిందని తెల్సాక ఆమెను వివాహం చేసుకొనే సంస్కారం నా హృదయానికి లేకపోయింది. చిన్నప్పట్నుంచీ నా పురోభివృద్ధికి ఎన్నో విధాలుగా సహాయపడిన మామయ్యకు కృతజ్ఞత చూపించ లేకపోయాను. అనుక్షణం రాక్షసుల్లా ఈ సమాజంలో నేనూ ఒక భాగమే కాబట్టి, సమాజం చేసే విమర్శలకు గురయిపోతానేమోనన్న భయంతోను, సంకుచితమైన దృష్టితోను, స్వార్థబుద్ధితోను ఆమెకు అన్యాయం చేశాను. కన్యగానే తల్లి కాబోతుందన్న అపవాదును భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకొంది."

"శేఖర్! ఇక చెప్పకండి! నేను విన

తేను! ఏళ ఏళలాడుతూ నిత్య సుమంగళినై కాపురం చేసుకొంటుం దనుకొన్నాను. ఆ దేవత చాలాకాలం క్రితం చనిపోయిందన్న విషయాన్ని ఓ స్నేహితుడు చెప్పినా నేను నమ్మలేదు. ఆమె బ్రతికే ఉందన్న ఊహ నా మనస్సులో స్థిరంగా నాటుకుపోయింది. మీ 'కోకిల' కథ చదివాక నా ఊహకు కొత్త ఊపిరి వచ్చినట్లయింది. ఆ దేవత బ్రతికే ఉందన్న ఆశ నన్నింత దూరం తీసుకు వచ్చింది. కాని నాఊహ తారుమారైంది. నా ఆశ అడియాసయ్యింది. మీ కథలోని పాత్రలన్నీ కేవలం కల్పితాలేనని ఋజువయ్యింది. ఎంతో ఉన్నతంగా సృష్టించిన మధుబాబు పాత్రను మీలో చూద్దామనుకొన్నాను. కాని ప్రతిఫలంగా మీ పిరికితనం, బలహీనతలు బహిర్గతమయ్యాయి!" అంటూ కిటికీ దగ్గరకు వెళ్ళి శూన్యంలోకి చూస్తూండిపోయాడు ఆనందరావు.

"మిస్టర్ ఆనందరావ్! కథవేరు! జీవితం వేరు! ఒక రచయిత రాసే కథలను బట్టి అతని వ్యక్తిత్వాన్ని అంచనా కట్టటం అసాధ్యం. పాఠకుల ప్రశంసలను పొందటానికి రచయిత తన కథలో ఎన్నో నీతిబోధలు చేయవచ్చు. కాని అతను వాటికి కట్టుబడి ఉంటాడని గాని అతని కథలోని ఆశయాలను, ఆదర్శాలను ఆచరిస్తాడనిగాని భావిస్తే మాత్రం అది అవివేకమే అవుతుంది!"

"శేఖర్ గారూ! కేవలం పేరు ప్రతిష్ఠల కోసమే పెద్దపెద్ద ఆశయాలను, ఆదర్శాలను కథల్లో రాస్తున్నారా? అంత మాత్రానికే ఉత్తమ రచయితలై పోయామనుకొంటున్నారా? అసలు ఇలాంటి కథలెందుకు రాస్తున్నారు? ఇలా ఆత్మ వంచన చేసుకోవటానికి ఎందుకు అలవాటు పడ్డారు? పేదల పట్ల సానుభూతిని చూపించాలని, సంఘంలో ప్రబలి ఉన్న అవినీతిని అరికటాలని నీతి వాక్యాలను మీ రచనలో చొప్పించి నిజ జీవితంలో ఇంత భీరువులుగా ఎందుకు మారిపోతున్నారు? ఆచరణలో పెట్టగలే ఆత్మస్థైర్యం, ఆదర్శహృదయంలేనప్పుడు ఎంతో గొప్ప గొప్ప పాత్రలను సృష్టించి పాఠకుల నెందుకు మోసం చేస్తున్నారు? తమ తప్పులను తాము తెల్సుకోలేని, తమను తాము సంస్కరించుకోలేని మీ లాంటి గుర్వింద ఉన్నంత వరకు ఈ సమాజం బాగుపడదు. హృదయ మనేది ఉంటే దయచేసి ఇక నుంచీ కథలు రాయటం మానుకోండి. వస్తా!" అనేసి బయటకు వెళ్ళిపోయాడు ఆనందరావు.

అతన్ని వెనక్కి పిలవాలనే ఆలోచన నాకు గల్గలేదు.

లోపల్నుంచి రేణుక వచ్చి, "ఏమండీ! అతను వెళ్ళిపోయాడా?"

అని అడిగే వరకూ నేను అలానే స్థాణువులా నిలబడి పోయాను.

"రేణూ! నీ కతను తెలుసా?"

"తెల్సు."

"ఎలా?"

"అతనేనండి అక్కయ్యను మోసం చేసింది."

"అంటే....?"

"మీ కథలోని వాసు పాత్ర."

ఆ మాటలు విని నేను కొయ్యబారి పోయాను.